సాక్షి వనపర్తి

మంగళవారం । 22 । జూలై । 2025



డిజిటల్ చెల్లింపులు

ఆర్టీసీ సంస్థ సైతం టికెట్ల జారీకి యూపీఐ చెల్లింపులు చేపడుతుంది.

వివరాలు 8లో ▸



..విద్యుదుత్పత్తి

జూరాల ప్రాజెక్టు వద్ద 11 యూనిట్లలో విద్యుదుత్పత్తి చేపడుతున్నారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.5 /22.4

వాతావరణం

అప్పుడప్పుడు ఆకాశం మేఘావృతమై ఉంటుంది. మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉంది.

మరో నాలుగు..!

ఉమ్మడి పాలమూరులో పెరగనున్న అసెంబ్లీ స్థానాలు

- నూతనంగా పెబ్బేరు, ఆమనగల్, మహబూబ్‌నగర్ రూరల్ ఖాయం
- కోస్గి లేదా అయిజలో ఏదైనా ఒక్కటి..
- రాష్ట్రంలో రంగారెడ్డి తర్వాత 18 సీట్లతో రెండోస్థానంలో జిల్లా..
- నియోజకవర్గాల పునర్విభజన తర్వాత మారనున్న భౌగోళిక సరిహద్దులు
- 2027 మార్చిలో కొత్త జనాభా లెక్కలు రాగానే డీలిమిటేషన్ ప్రక్రియ షురూ

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: దేశవ్యాప్తంగా అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. 2027 మార్చిలో కొత్త జనాభా లెక్కలు పూర్తి చేసి.. డీలిమిటేషన్ ప్రక్రియ మొదలుపెట్టనున్నట్లు ఇటీవలే స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజనను నెమరువేసుకుంటూ.. ప్రస్తుతం ఎలాంటి మార్పులు, చేర్పులు చోటుచేసుకుంటాయోననే చర్చ రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది. ఈ మేరకు ప్రధాన పార్టీల ముఖ్య నేతలు, ఎమ్మెల్యే ఆశావహులు ఎవరికి వారు అంచనాల్లో మునిగిపోయారు. ఈ క్రమంలో పెరగనున్న అసెంబ్లీ స్థానాలు.. మారనున్న నియోజకవర్గాల భౌగోళిక సరిహద్దులపై 'సాక్షి' ప్రత్యేక కథనం..



రాష్ట్రం మొత్తం జనాభాను పరిగణనలోకి తీసుకుని.. నియోజకవర్గంలో ఉండాల్సిన సగటు జనాభాను నిర్ణయిస్తారు. అందుబాటులో ఉన్న 2011 జనాభా లెక్కల ఆధారంగా రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో సగటు జనాభా 2,30,064 (పది శాతం జనాభా తక్కువ లేదా ఎక్కువ ఉండొచ్చు). దీని ప్రకారం తెలంగాణలో ఉన్న 119 అసెంబ్లీ స్థానాలు 153కు చేరుకోనున్నాయి. ఈ లెక్కన 34 నియోజకవర్గాలు కొత్తగా ఆవిర్భవించే అవకాశం ఉంది. అదేవిధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో జనాభా 40,53,028 (2011 లెక్కల ప్రకారం) ఉండగా.. 14 అసెంబ్లీ స్థానాలు 18కి చేరుకోనున్నాయి.

■ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం 14 అసెంబ్లీ సెగ్మెంట్లు (షాద్‌నగర్, జడ్చర్ల, మహబూబ్‌నగర్, దేవరకద్ర, వనపర్తి, నారాయణపేట, మక్తల్, కొడంగల్, గద్వాల, అలంపూర్, నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేట) ఉన్నాయి. పునర్విభజన చేపడితే మరో నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాలు కొత్తగా ఆవిర్భవించనున్నాయి. ఇందులో పెబ్బేరు/కొత్తకోట, ఆమనగల్, మహబూబ్‌నగర్ రూరల్ ఖాయమని.. కోస్గి, అయిజలో ఏదైనా ఒకటి కొత్త నియోజకవర్గంగా ఏర్పడే అవకాశం ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఉమ్మడి మహబూబ్‌నగర్ ఐదు జిల్లాలుగా (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల) విడిపోగా.. పలు నియోజకవర్గాలు, మండలాలు రెండు, మూడు జిల్లాల పరిధిలో ఉన్నాయి. వాటిని ఒకే జిల్లా పరిధిలోకి తీసుకురానున్నారు.

ముఖ్యనేతల నజర్

2027 మార్చి నాటికి దేశవ్యాప్తంగా జనగణన పూర్తి చేసి.. ఆ తర్వాత ఆరు నెలల్లో నియోజకవర్గాల డీలిమిటేషన్ తతంగం ముగించేలా కేంద్రం ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది. ఈ మేరకు 2028 నవంబర్ లేదా డిసెంబర్‌లో తెలంగాణ శాసనసభకు ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. నియోజకవర్గాల పునర్విభజన జరిగిన పక్షంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 9 స్థానాలు పెరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన ఆ జిల్లా మొత్తం అసెంబ్లీ స్థానాలు 23కు చేరుకుంటాయి. దీని తర్వాత మహబూబ్‌నగర్ జిల్లా 18 నియోజకవర్గాలతో రాష్ట్రంలోనే ద్వితీయ స్థానంలో నిలవనుంది. పునర్విభజనతో రాజకీయాల్లో కీలక పరిణామాలు చోటుచేసుకునే అవకాశం ఉండడంతో వివిధ పార్టీల ముఖ్య నేతలు, ఆశావహులు కొత్తగా ఏర్పాటయ్యే నియోజకవర్గాలపై దృష్టి సారించారు. తమ కుటుంబసభ్యులను రాజకీయారంగేట్రం చేసేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది.

పెబ్బేరు



వనపర్తి జిల్లా, ఆ నియోజకవర్గంలో ఉన్న పెబ్బేరు కేంద్రంగా కొత్త నియోజకవర్గం ఏర్పాటయ్యే అవకాశం ఉంది. వనపర్తి, కొల్లాపూర్, దేవరకద్ర నియోజకవర్గాల పరిధిలో రెండేసి మండలాలను దీని పరిధిలో చేరుస్తారని అంచనా. 2011 లెక్కల ప్రకారం పరిశీలిస్తే ఆయా మండలాలు/పట్టణంలో జనాభా 2,12,253. సగటు జనాభా 2,30,064లో పది శాతం తీసేసి పోలిస్తే.. జనాభా కొంత ఎక్కువగానే ఉంది. దీంతో పాటు పెబ్బేరు, కొత్తకోట జాతీయ రహదారి 44ను ఆనుకుని ఉండడడంతో ఈ నియోజకవర్గ ఏర్పాటు ఖాయమనే వాదనలు వినిపిస్తున్నాయి.

మండలం	జనాభా
పెబ్బేరు (వనపర్తి)	48,749
కొత్తకోట (దేవరకద్ర)	59,331
శ్రీరంగాపూర్ (వనపర్తి)	19,941
వీపనగండ్ల (కొల్లాపూర్)	27,378
చిన్నంబావి (కొల్లాపూర్)	28,949
మదనాపురం (దేవరకద్ర)	27,905
మొత్తం	2,12,253

కోస్గి లేదా అయిజ..



ప్రస్తుత నారాయణపేట **జిల్లా, కొడంగల్** నియోజ**కవర్గ పరిధిలో**ని కోస్గి, **మద్దూరు, కొత్త**పల్లి, గుం**డుమాల్, పరిగి** నియో**జకవర్గంలోని** గండేడ్ కలుపుకొని **కోస్గి** అసెంబ్లీ నియోజకవర్గంగా ఆవిర్భవించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అవసరమైతే నారాయణపేట నియోజకవర్గంలోని దామరగిద్ద మండలాన్ని కూడా కలిపే చాన్స్ ఉన్నట్లు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇది సాధ్యం కాని పక్షంలో జోగుళాంబ గద్వాల జిల్లాలోని కర్ణాటక సరిహద్దులో ఉన్న అయిజకు చాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. అలంపూర్ నియోజకవర్గంలోని అయిజ, వడ్డేపల్లి, రాజోళి, గద్వాల నియోజకవర్గంలోని గట్టు కలిపి అయిజ నియోజకవర్గంగా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కోస్గి పరిధిలో ఇలా..

మండలం	జనాభా
కోస్గి, గుండుమాల్ (కొడంగల్)	57,475
మద్దూరు, కొత్తపల్లి (కొడంగల్)	67,395
గండేడ్ (పరిగి)	36,328
దామరగిద్ద (నారాయణపేట)	57,946
మొత్తం	2,19,144

అయిజ పరిధిలో..



మండలం	జనాభా
అయిజ (అలంపూర్)	85,303
వడ్డేపల్లి, రాజోళి (అలంపూర్)	69,445
గట్టు (గద్వాల)	72,977
మొత్తం	2,27,725

ఆమనగల్


మండలం	జనాభా
ఆమనగల్ (కల్వకుర్తి)	62,034
మాడ్గుల (కల్వకుర్తి)	49,133
తలకొండపల్లి (కల్వకుర్తి)	52,835
కడ్తాల్ (కల్వకుర్తి)	36,406
వెల్దండ (కల్వకుర్తి)	46,006
మొత్తం	2,46,414



ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో కల్వకుర్తి నియోజకవర్గ పరిధిలో ఉన్న ఆమనగల్, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల్ మండలాలు జిల్లాల పునర్విభజనలో రంగారెడ్డికి వెళ్లాయి. నియోజకవర్గాల పునర్విభజన జరిగితే ఈ మండలాలతో పాటు కల్వకుర్తి నియోజకవర్గంలోని వెల్దండ మండలం కలిసి ఆమనగల్ అసెంబ్లీ నియోజకవర్గంగా ఏర్పాటయ్యే అవకాశం ఉంది. 2011 సగటు జనాభాతో పాటు భౌగోళికంగా సరిపోనుండడంతో కొత్తగా ఈ నియోజకవర్గం ఏర్పాటయ్యే అవకాశాలు ఎక్కువనే అభిప్రాయం రాజకీయవర్గాల్లో వ్యక్తమవుతోంది. ఇక కల్వకుర్తి నియోజకవర్గంలో కల్వకుర్తి మండలం మిగలగా.. ఈ నియోజకవర్గంలో అచ్చంపేట నుంచి వంగూరు, చారకొండ.. జడ్చర్ల నుంచి ఊర్కొండ, నాగర్‌కర్నూల్ నుంచి తాడూరు మండలాలను చేర్చే అవకాశం ఉంది.

మహబూబ్‌నగర్ రూరల్

మహబూబ్‌నగర్ జిల్లాలో ప్రస్తుతం మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు (మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర) ఉన్నాయి. మరో నియోజకవర్గంగా మహబూబ్‌నగర్ రూరల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ పరిధిలోని మహబూబ్‌నగర్ రూరల్ మండలం, హన్వాడ, పరిగి నియోజకవర్గంలోని మహమ్మదాబాద్, నారాయణపేట సెగ్మెంట్‌లోని కోయిల్‌కొండ, జడ్చర్ల పరిధిలోని నవాబుపేట మండలాలతో కలిపి మహబూబ్‌నగర్ రూరల్ నియోజకవర్గం ఏర్పాటు చేసే అవకాశం ఉంది. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి (2011 లెక్కల ప్రకారం జనాభా 2,17,942)ని మహబూబ్‌నగర్ అర్బన్ నియోజకవర్గం చేసే అవకాశం ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



మండలం	జనాభా
మహబూబ్‌నగర్ రూరల్	42,523
హన్వాడ (మహబూబ్‌నగర్)	55,044
మహమ్మదాబాద్ (పరిగి)	34,087
కోయిల్‌కొండ (నారాయణపేట)	66,721
నవాబుపేట (జడ్చర్ల)	52,061
మొత్తం	2,50,436

న్యూస్‌రీల్

ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



వనపర్తి రూరల్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త పనిచేయాలని ఆ పార్టీ జిల్లా కన్వీనర్ మెంటెపల్లి పురుషోత్తంరెడ్డి అన్నారు. సోమవారం పెబ్బేరు పట్టణంలో ఏర్పాటుచేసిన బీజేపీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. పేదల సంక్షేమం కోసం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ తరఫున మెజార్టీ స్థానాల్లో విజయం సాధించాలన్నారు. ప్రతి బూత్‌లో కమిటీలను ఏర్పాటుచేసి.. ఈ నెల 25, 26 తేదీల్లో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 1, 2 తేదీల్లో గ్రామాల్లో పాదయాత్ర చేపట్టి.. స్థానిక సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు నాగరాజుయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామన్‌గౌడ్, నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, రాఘవేందర్‌గౌడ్, వెంకట్రామారెడ్డి, నారాయణ తదితరులు ఉన్నారు.

రామన్‌పాడులో 1,019 అడుగుల నీటిమట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో సోమవారం 1,019 అడుగులకు నీటిమట్టం వచ్చి చేరింది. జూరాల ఎడమ కాల్వ నుంచి 1,030, సమాంతర కాల్వ ద్వారా 700 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. రామన్‌పాడు జలాశయం నుంచి ఎన్టీఆర్ కాల్వకు 894, కుడి, ఎడమ కాల్వలకు 52, వివిధ లిఫ్ట్‌లకు 872, తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ వరప్రసాద్ తెలిపారు.

అభివృద్ధి పనులు పూర్తి చేయరా?



వనపర్తి: జిల్లా కేంద్రంలో చేపట్టిన అభివృద్ధి పనులు సంవత్సరాల తరబడి అసంపూర్తిగా ఉండటం సిగ్గుచేటని బీసీ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని చింతల ఆంజనేయస్వామి, కాళికాంబ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం మార్నింగ్ వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. రోడ్ల విస్తరణ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. రూ.కోట్లతో నిర్మించిన టౌన్ హాల్, కూరగాయల మార్కెట్ సముదాయం, ఇండోర్ స్టేడియాన్ని అందుబాటులోకి తేవాలన్నారు. పాత బస్టాండ్‌ను పునర్నిర్మించి ప్రయాణికులకు అందుబాటులోకి తేవాలని ఆర్టీసీ అధికారులను కోరారు. హాకీ అకాడమీలో క్రీడాకారులకు సరైన వసతులు కల్పించకపోవడం సరికాదన్నారు. స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ సొంత జిల్లాలో క్రీడాకారులు ఇబ్బందులకు గురికావడం బాధాకరమని అన్నారు. అసంపూర్తి పనులపై ప్రత్యేక దృష్టిసారించి త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దయానంద్, నాయకులు వహీద్, రమేశ్‌సాగర్, దేవర శివ, వీవీ గౌడ్, గూడుషా, ధర్మేంద్ర సాగర్, రమేశ్, నర్సింహ యాదవ్, ప్రసాద్‌గౌడ్, నాగరాజు, నరేందర్, యశ్వంత్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- వర్షాల నేపథ్యంలో ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఆదర్శ్ సురభి, వివిధ శాఖల అధికారులు

వనపర్తి: జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి అన్నారు. కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో సోమవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయానికి సాగునీటి లభ్యత, రైతులకు ఎరువుల పంపిణీ, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలు, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. కలెక్టరేట్ నుంచి వీసీలో కలెక్టర్ ఆదర్శ్ సురభి పాల్గొన్నారు. వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందుజాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు పారిశుద్ధ్యం, డ్రై డే కార్యక్రమాలను ముమ్మరం చేయాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కలెక్టర్ ఆదేశించారు. పశువులకు సంబంధించి వెటర్నరీ విభాగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏమైనా ప్రమాదాలు సంభవిస్తే బాధితులకు అండగా నిలవాలన్నారు. ముఖ్యంగా గిరిజన అటవీ ప్రాంతాల్లో ఉండే ప్రజలు అంటువ్యాధుల బారిన పడకుండా చూడాలన్నారు. ఈ నెల 25నుంచి వచ్చే నెల 10వ తేదీ వరకు మండలాల వారీగా రేషన్ కార్డులను పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేయాలని పౌరసరఫరాలశాఖ అధికారికి సూచించారు. అదే విధంగా ఎరువుల దుకాణాల్లో స్టాక్ వివరాలు తెలియజేసేలా బోర్డులు ఏర్పాటు చేయించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలు పాటించని దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఇక వ్యవసాయానికి అవసరం మేరకు నీటిని విడుదల చేసే విధంగా వ్యవసాయ, నీటిపారుదలశాఖ అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ముందస్తు వాతావరణ సూచనలను ఎప్పటికప్పుడు తెలియజేయాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ సూచించారు. విపత్తు నిర్వహణకు సంబంధించి మాక్ డ్రిల్ ఏర్పాటుచేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వరదలకు సంబంధించి రోజు ఇన్‌ఫ్లో, అవుట్ ఫ్లో వివరాలు సమర్పించాలని నీటి పారుదల శాఖ అధికారులకు ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ జి.వెంకటేశ్వర్లు, వివిధ శాఖల అధికారులు ఉన్నారు.

రైతులే నడుం బిగించి.. జమ్ము తొలగించి



కేఎల్‌ఐ డీ-1 కాల్వలో జమ్ము తొలగిస్తున్న రైతులు

కేఎల్‌ఐ డీ-1 కాల్వను శుభ్రం చేసుకున్న ఆయకట్టు రైతులు

పాన్‌గల్: కల్వకుర్తి ఎత్తిపోతల పథకం డీ-1 కాల్వలో నీటి పారుదలకు అడ్డంకిగా మారిన జమ్ము, పిచ్చిమొక్కల తొలగింపునకు ఆయకట్టు రైతులు నడుం బిగించారు. కాల్వలో పూడిక తీయించడంతో పాటు జమ్ము, పిచ్చి మొక్కలను తొలగించాలని అధికారులకు ఎన్ని మార్లు విన్నవించినా ఫలితం లేకపోవడంతో రైతులే స్వయంగా రంగంలోకి దిగారు. రోజుకు కొంతమంది చొప్పున మూడు రోజులుగా కాల్వలో పెరిగిన జమ్ము, పిచ్చిమొక్కలు తొలగిస్తున్నారు. పాన్‌గల్ మండలం తెల్లరాళ్లపల్లితండా సమీపంలో ప్రవహిస్తున్న కేఎల్‌ఐ డీ-1 కాల్వ కింద దాదాపు 100 మంది గిరిజన రైతులు 300 ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. ఈ కాల్వకు కొన్నేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడం.. కనీసం జమ్ము, పిచ్చిమొక్కల తొలగింపునకు అధికారులు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో చివరి ఆయకట్టుకు సాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ప్రతి ఏడాది సాగునీటి కోసం ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటూ వస్తున్నారు. ఈ ఏడాది అయినా సాగునీరు విడుదలకు ముందే కాల్వకు మరమ్మతు చేయించి.. సాగునీరు సాఫీగా అందేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు వినతిపత్రాలు సమర్పించడంతో పాటు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారానికి నోచుకోలేదని ఆయకట్టు రైతులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కేఎల్‌ఐ డీ-1 కాల్వకు మరమ్మతు చేయించడంతో పాటు పూడిక, జమ్మును పూర్తిగా తొలగించాలని కోరుతున్నారు.

మున్సిపల్ వాహనాలకు రోడ్లే దిక్కు!

- వనపర్తి పురపాలికలో పార్కింగ్ స్థలం కరువు
- చెత్త సేకరణ ట్రాక్టర్లు, వాటర్ ట్యాంకర్లు, ఇతర వాహనాలు రోడ్లపైనే నిలిపివేత
- ప్రతిపాదనలకే పరిమితమైన స్థలం కేటాయింపు



జిల్లా కేంద్రంలో రోడ్డుపై నిలిపిన మున్సిపల్ వాహనాలు

వనపర్తిటౌన్: జిల్లా కేంద్రమైన వనపర్తి మున్సిపాలిటీ వాహనాల పార్కింగ్‌కు స్థలం కరువైంది. కోట్లాది రూపాయల ప్రజాధనంతో కొనుగోలు చేసిన మున్సిపల్ వాహనాలు నిలిపేందుకు రోడ్లే దిక్కయ్యాయి. పురపాలికలో ఎక్కడైనా పార్కింగ్ సమస్య ఉంటే అధికారులే ప్రత్యేక చొరవ తీసుకొని పరిష్కరించాల్సి ఉంటుంది. కానీ మున్సిపాలిటీ వాహనాల పార్కింగ్ సమస్య కొన్నేళ్లుగా పట్టిపీడిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. ఫలితంగా వాహనాలకు భద్రత లేకుండా పోతోంది. వనపర్తి మున్సిపాలిటీలో ఇంటింటి చెత్త సేకరణ కోసం 14 ట్రాక్టర్లు, మూడు ఆటోలతో పాటు రెండు ప్రొక్లెయినర్లు, రెండు వైకుంఠ రథాలు, రెండు వాటర్ ట్యాంకర్లు ఉన్నాయి. ఉదయం, మధ్యాహ్నం రెండు విడతల్లో ట్రాక్టర్లు, ఆటోలద్వారా చెత్తను సేకరించిన అనంతరం వాటిని రోడ్లపై పార్కింగ్ చేస్తున్నారు. మిగతా వాహనాలను సైతం ఎక్కడబడితే అక్కడే నిలిపివేస్తున్నారు.

భద్రత కరువు..

రోడ్లపైన నిలుపుతున్న వాహనాలకు తరచుగా మరమ్మతులు తప్పడం లేదు. వాహనాలకు సంబంధించి కేబుల్ వైర్లు, ఇతర సామగ్రి చోరీకి గురవుతున్నాయి. వాటిని రీప్లేస్‌మెంట్ చేసేందుకు మున్సిపాలిటీ నిధులను భారీగా వెచ్చించాల్సి వస్తోంది. వాహనాల్లోని ఇంధనం సైతం చోరీకి గురవుతుందని తెలుస్తోంది. దీనికి తోడు వాహనాలకు నీడ సౌకర్యం లేకుండా పోవడంతో వాటి సామర్థ్యం తగ్గడంతో పాటు పలు పరికరాలు పాడైపోతున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. అయితే కొన్ని వాహనాలకు మంటలు చెలరేగి పాడైపోయిన ఉదంతాలు ఉన్నాయి. 2020లో రహదారులను శుభ్రం చేసేందుకు రూ. 62లక్షలతో స్వీపింగ్ మిషన్ కొనుగోలు చేయగా.. ముణ్నాళ్ల ముచ్చటగానే మారింది. అయితే మున్సిపల్ వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం అవసరమని గుర్తించిన జిల్లా మొదటి కలెక్టర్ శ్వేతా మహంతి.. ప్రస్తుత పురకార్యాలయానికి అర కిలోమీటర్ దూరంలోని చాడేశ్వరి ఆలయ సమీపంలో ఎకరా స్థలం కేటాయించేందుకు నిర్ణయం తీసుకున్నారు. తదనంతరం ఆమె బదిలీ కావడంతో ప్రతిపాదించిన స్థలాన్ని పార్కింగ్‌కు మలుచుకునేందుకు ఏ అధికారి ప్రయత్నం చేయకపోవడంతో వనపర్తి మున్సిపాలిటీ వాహనాలకు పార్కింగ్ సమస్య తీరని లోటుగా మారింది.

అధికారుల దృష్టికి తీసుకెళ్తాం..



మున్సిపల్ వాహనాల పార్కింగ్‌కు కార్యాలయ ఆవరణలో స్థలం లేని మాట వాస్తవమే. గతంలో ఏమైనా ప్రతిపాదనలు ఉన్నాయో తెలుసుకొని మరోసారి కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తాం. వాహనాలకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం ఉంటే వాటి భద్రతపై ఎలాంటి అనుమానాలకు తావు ఉండదు.

– ఎన్.వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్, వనపర్తి

ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ అమలు



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్

వనపర్తిటౌన్: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తోందని.. బీఆర్‌ఎస్ నాయకులు లేనిపోని విమర్శలు చేయడం మానుకొని అభివృద్ధికి సహకరించాలని డీసీసీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వం ఏ ఒక్క కుటుంబానికి రేషన్ కార్డు ఇవ్వకుండా కాలం గడిపిందని.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన అనతి కాలంలోనే ఒక్క వనపర్తి జిల్లాలో 36,323 కుటుంబాలకు రేషన్ కార్డులు మంజూరు చేశామన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లావ్యాప్తంగా 61,687 రైతులకు రూ.49,11,43,107 కోట్ల రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. రైతుభరోసా కింద 1,75,869 మంది రైతులకు రూ. 205 కోట్ల పంట పెట్టుబడి సాయం అందించామని వివరించారు. ప్రతి పేదవాడు ఆత్మగౌరవంతో బతకాలనే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇళ్లు ఇళ్లు నిర్మించి ఇస్తున్నామన్నారు. కాంగ్రెస్ మాటల ప్రభుత్వం కాదు.. చేతల ప్రభుత్వమనే సత్యాన్ని సీఎం రేవంత్‌రెడ్డి నిరూపిస్తున్నారని అన్నారు. రెండు మార్లు అధికారంలోకి వచ్చి కృష్ణా, గోదావరి నీళ్ల వాటా కోసం నోరు మెదపని నాయకులు.. నేడు సీఎం రేవంత్‌రెడ్డిపై విమర్శలు చేయడం సరికాదన్నారు. ఈ నెల 25న న్యూఢిల్లీ తల్కటోరా స్టేడియంలో నిర్వహించే భాగీ దారి న్యాయ సమ్మేళనానికి జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి చీర్ల జనార్దన్, మైనార్టీసెల్ అధ్యక్షుడు సమద్ మియా, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకీ రాములు, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరె రాములు, వివిధ మండలాల అధ్యక్షులు చంద్రశేఖర్ యాదవ్, పెంటన్న యాదవ్ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

బాలుడి ప్రాణం తీసిన ఈత సరదా..


సాయి (ఫైల్)

మిడ్జిల్: సరదాగా ఈతకు వెళ్లిన ఓ బాలుడు ప్రమాదవశాత్తు నీట మునిగి మృతి చెందిన ఘటన మిడ్జిల్ మండలం వల్లభ్‌రావుపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలిలా.. వల్లభ్‌రావుపల్లికి చెందిన జక్క రఘు, యాదమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు నరేష్, సాయి(7) ఉన్నారు. సోమవారం సెలవు దినం కావడంతో అన్నదమ్ములు నరేష్, సాయి కలిసి మధ్యాహ్నం గ్రామ సమీపంలోని దుందుభీ వాగు వద్దకు వెళ్లారు. వాగు సమీపంలో ఇటీవల ఇళ్ల నిర్మాణానికి ఇసుక తరలించడంతో పెద్ద గొయ్యి ఏర్పడింది. దాంట్లో నీరు నిల్వ ఉండడంతో ఇద్దరు ఈత కొట్టేందుకు అందులోకి దిగారు. కాసేపటికి అన్న నరేష్ బయటకు రాగా.. తమ్ముడు సాయి మునిగిపోయాడు. వెంటనే అన్న చుట్టుపక్కల వారికి చెప్పగా వారు వచ్చి నీట మునిగిన బాలుడు సాయిని బయటికి తీశారు. కానీ, అప్పటికే అతడు మృతిచెందాడు. బాలుడు మండల కేంద్రంలోని ఓ పాఠశాలలో మూడో తరగతి చదువుతున్నాడు. ఇదిలాఉండగా, అప్పటి వరకు కళ్ల ముందు ఆడుకున్న కుమారుడు కానరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి. ఎస్‌ఐ శివనాగేశ్వర్‌నాయుడును వివరణ కోరగా.. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

ఉరేసుకొని వ్యక్తి బలవన్మరణం


జడ్చర్ల: ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన జడ్చర్లలో ఆదివారం చోటుచేసుకుంది. వివరాలిలా.. పట్టణంలోని నిమ్మబాయిగడ్డకు చెందిన కుంకుళ్ల లలితమ్మ పెద్ద కుమారుడు రామకృష్ణ(38). ఇతనికి జడ్చర్లకు చెందిన మణెమ్మతో గత 13 సంవత్సరాల క్రితం వివాహం జరిగింది. కాగా గత కొన్ని సంవత్సరాలుగా వారు కొత్తగా నిర్మించుకున్న ఇంట్లో ఉండేవారు. అయితే, ఈ నెల 20న తన కుమారుడు రామకృష్ణకు లలితమ్మ ఫోన్ చేయగా.. ఎంతకూ ఎత్తకపోవడంతో ఇంటికి వచ్చి చూసింది. అప్పటికే అతడు ఉరి వేసుకుని కనిించాడు. వెంటనే ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కాగా తన కుమారుడు రామకృష్ణ మృతిపై అనుమానం ఉందని మృతుడి తల్లి లలితమ్మ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది.

అనారోగ్యంతో మహిళ ఆత్మహత్య

జడ్చర్ల: అనారోగ్యంతో బాధపడుతూ ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల మండలం బురుగుపల్లికి చెందిన అలవేలు కూతురు స్వప్న(26)ను ఏడేళ్ల క్రితం కొమరబండ గ్రామానికి చెందిన శేఖర్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. కాగా కొన్ని రోజులుగా ఆమె అనారోగ్యంతో బాధపడుతుండగా ఆసుపత్రిలో చూపించేందుకు బూర్గుపల్లికి తీసుకుని వచ్చి తమ ఇంట్లో ఉంచుకున్నట్లు తల్లి అలివేలు తెలిపారు. కాగా ఇక్కడే ఉంటూ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉండేది. అయితే, ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో తాము పడుతున్న కష్టం చూసిన కూతురు ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని, ఈ విషయంలో అనారోగ్యంతో ఉన్న ఆమె తనకు తానుగానే ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసునమోదు చేసినట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

ఆర్టీసీలో డిజిటల్ చెల్లింపులు

- యూపీఐ ద్వారా టికెట్ల జారీ
- సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌లలో పూర్తిస్థాయి అమలు
- పల్లెవెలుగు బస్సుల్లో దాదాపు 50 శాతం



స్టేషన్ మహబూబ్‌నగర్: ఆర్టీసీ సంస్థ సైతం సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటుంది. ఓ వైపు చిల్లర సమస్యలకు చెక్ పెడుతూ.. టికెట్ల జారీకి యూపీఐ చెల్లింపులు చేపడుతుంది. మరోవైపు గమ్యం, రిజర్వేషన్ యాప్‌ల ద్వారా ప్రయాణికుడికి ఎంతో వెసులుబాటు కల్పిస్తోంది. ముఖ్యంతో గమ్యం యాప్‌తో రూట్‌ల ప్రకారం బస్సులు ఎక్కడికి, ఏ సమయానికి వెళుతాయనే వివరాలు తెలుసుకోవచ్చు. అదే విధంగా రిజర్వేషన్ చేసుకున్న బస్సు మనం ఎక్కాల్సిన స్టాప్‌కు ఎప్పుడు వస్తుందని, ప్రస్తుతం ఎక్కడో ఉందనే ట్రాకింగ్ సౌకర్యం అందుబాటులో ఉంది. అదే విధంగా ఈ యాప్‌లో మహిళా ప్రయాణికుల భద్రతకు పెద్దపీట వేశారు.

చిల్లర సమస్యలకు చెక్

ఆర్టీసీ బస్సుల్లో యూపీఐ చెల్లింపులతో ఎంతో వెసులుబాటు లభించనుంది. ముఖ్యంగా టికెట్ల జారీ సమయంలో చిల్లర సమస్యకు పరిష్కారం లభిస్తుంది. అదే విధంగా టికెట్లు ఇవ్వడంలో కొంతమేర సమయం ఆదా అయ్యే అవకాశం ఉంటుంది. ఈ మేరకు ఇప్పటికే గతంలో టికెట్లను జారీ చేసే పాత టిమ్ స్థానంలో ఐ– టిమ్ మెషిన్లు అందుబాటులోకి వచ్చాయి. పూర్తిగా టచ్ స్క్రీన్ ద్వారా ఈ మిషన్లు నడుస్తున్నాయి. యూపీఐ చెల్లింపులు పూర్తయిన వెంటనే మిషన్ టికెట్ జారీ అవుతుంది. ఇప్పటికే ప్రయాణికుల నుంచి యూపీఐ చెల్లింపులకు విశేషమైన ఆదరణ లభిస్తుంది. ముఖ్యంగా హైదరాబాద్ రూట్‌లో యూపీఏ చెల్లింపులు ఎక్కువగా జరుగుతున్నట్లు తెలుస్తోంది,

యూపీఐ చెల్లింపులు

ప్రస్తుతం మార్కెట్లో యూపీఐ చెల్లింపుల హవా విపరీతంగా కొనసాగుతోంది. దీంతో ఆర్టీసీ సంస్థ కూడా యూపీఐ చెల్లింపులకు శ్రీకారం చుట్టింది. నెలన్నర నుంచి ఆర్టీసీ బస్సుల్లో టికెట్ల జారీకి యూపీఐ చెల్లింపులు విధానాన్ని అమలుచేస్తున్నారు. మహబూబ్‌నగర్ ఆర్టీసీ రీజియన్‌లోని పది డిపోల పరిధిలోని సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో పూర్తిస్థాయిలో యూపీఐ చెల్లింపులు చేస్తుండగా పల్లెవెలుగు బస్సుల్లో దాదాపు 50 శాతం వరకు అమలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ రీజియన్‌లో సూపర్ లగ్జరీ 40 బస్సులు, డీలక్స్ 40 బస్సులు, ఎక్స్‌ప్రెస్ 284, పల్లె వెలుగు 494 బస్సులు ఉన్నాయి.

త్వరలో పూర్తిస్థాయిలో అమలు

ఆర్టీసీ బస్సుల్లో యూపీఐ చెల్లింపులు ప్రారంభమయ్యాయి. ముందుగా సూపర్ లగ్జరీ, డీలక్స్, ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో వందశాతం యూపీఐ చెల్లింపులు జరుగుతున్నాయి. పల్లె వెలుగు బస్సుల్లో 50 శాతం ఉందని, భవిష్యత్తులో ఈ బస్సుల్లో కూడా పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుంది. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా ఆర్టీసీ సంస్థ పనిచేస్తుంది.

– లక్ష్మీధర్మ, ఆర్టీసీ డివిజనల్ మేనేజర్, మహబూబ్‌నగర్

‘కవిత్వమే చిరస్థాయిగా నిలుస్తుంది’


రేపటికాలం కవిత్వం ఆవిష్కరిస్తున్న గోరటి వెంకన్న తదితరులు

కందనూలు: ప్రజా కవిత్వమే ఎప్పటికీ చిరస్థాయిగా నిలుస్తుందని ఎమ్మెల్సీ, ప్రజాకవి గోరటి వెంకన్న అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో కవి సంగమం వ్యవస్థాపకుడు యాకుబ్ సభాధ్యక్షతన ఎదిరేపల్లి కాశన్న రచించిన ‘రేపటి కాలం’ కవిత్వాన్ని ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించి మాట్లాడారు. సమకాలీన సమాజపు అలజడులకు చలించి గుండె లోతుల్లోంచి పద్యమై పలుకుతుందన్నారు. సమాజంలోని పలు సంఘటనలను కవిత్వం అసమానతలు, దోపిడీ, అధర్మం ధిక్కారంగా వినిపించారని కొనియాడారు. ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కాశీం మాట్లాడుతూ ఈ కవిత్వంలో వర్గీకరణ ఉద్యమం తుది దశకు చేరుకున్న చారిత్రక సందర్భం, పాటకు ప్రతిబింబమైన గద్దర్ జీవితం, సావిత్రిబాయి పూలే, సమ్మక్క, సారక్కలపై కవిత్వం వినిపించారని, సామాజిక, రాజకీయ దృక్పథం కవిత్వం నిండా పరుచుకుందన్నారు. సమాజంలో పాలకుల దోపిడీ విధానాలను కవిత్వంలో ఎజెండా చేయడం ప్రజా ఉద్యమాల నుంచి వచ్చిన కాశన్న ఉద్యమం తోవను విడవకుండా ప్రజల సమస్యలపై కవిత్వం రాశారన్నారు. కార్యక్రమంలో తగుళ్ల గోపాల్, కోట్ల వెంకటేశ్వరరెడ్డి, సామిడి జగన్‌రెడ్డి, చింతలపల్లి భాస్కరరావు, నాగవరం బాల్‌రాం, వనపట్ల సుబ్బయ్య, కందికొండ మోహన్, రమేష్‌బాబు, మద్దిలేటి, గుడిపల్లి నిరంజన్, ముచ్చర్ల దినకర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జట్టుకు ఘన విజయాలు


ఫాస్ట్ 5లో టోర్నీలో విజేతగా నిలిచిన తెలంగాణ పురుషుల జట్టు

- సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో సత్తా
- 2 బంగారు, రజతం, 2 కాంస్య పతకాలు


ఫాస్ట్ 5లో విన్నర్‌గా తెలంగాణ మహిళా జట్టు

మహబూబ్‌నగర్ క్రీడలు: తమిళనాడు రాష్ట్రంలోని సేలంలో ఈ నెల 17 నుంచి 20 వరకు జరిగిన వివిధ సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ పురుష, మహిళా జట్లు అద్భుతమైన ప్రతిభను కనబరిచినట్లు నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు విక్రం ఆదిత్యరెడ్డి అన్నారు. 2వ ఫాస్ట్ 5 సౌత్‌జోన్ నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ పురుషుల, మహిళా జట్లు బంగారు పతకాలు, 17వ సౌత్‌జోన్ ట్రెడిషనల్ నేషనల్ పోటీల్లో మహిళా జట్టు రజతం, పురుషుల జట్టు కాంస్యం, 1వ సౌత్‌జోన్ మిక్స్‌డ్ నేషనల్ పోటీల్లో రాష్ట్ర జట్టు కాంస్య పతకాలు సాధించాయన్నారు. ఆయా జట్లను నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ ప్రతినిధులు అభినందించారు. క్రీడాకారుల కృషి, కోచ్‌ల మార్గదర్శనంతో ఈ విజయాలు సాధించినట్లు తెలిపారు.

జూరాలకు తగ్గిన ఇన్‌ఫ్లో

- 72వేల క్యూసెక్కుల ప్రవాహం
- 8 క్రస్టు గేట్ల ఎత్తివేత
- 67,001 క్యూసెక్కుల నీరు దిగువకు..


జూరాల నుంచి 8 క్రస్టు గేట్ల ద్వారా దిగువకు విడుదలవుతున్న నీరు

ధరూరు/ఆత్మకూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వచ్చే వరద స్వల్పంగా తగ్గినట్లు పీజేపీ అధికారులు తెలిపారు. సోమవారం రాత్రి 8 గంటలకు 67 వేల క్యూసెక్కుల వరద వస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు 8 క్రస్టు గేట్లను ఎత్తి 31,806 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి కోసం 31,464 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్‌కు 315 క్యూసెక్కులు, నెట్టెంపాడుకు 750 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 66 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 1,250 క్యూసెక్కులు, కుడి కాల్వకు 600 క్యూసెక్కులు, ఆర్‌డీఎస్ లింక్ కెనాల్‌కు 150 క్యూసెక్కులు, భీమా లిఫ్టు–2కు 750 క్యూసెక్కులు, సమాంతర కాల్వకు 700 క్యూసెక్కులు కలిపి ప్రాజెక్టు నుంచి మొత్తం 67,001 క్యూసెక్కుల నీటిని దిగువన శ్రీశైలం ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి నిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం ప్రాజెక్టులో 7.663 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు పీజేపీ అధికారులు తెలిపారు. జూరాల ఎగువ విద్యుదుత్పత్తి కేంద్రంలో 5 యూనిట్లలో 195 మెగావాట్లు, దిగువన 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్ల విద్యుదుత్పత్తి చేస్తున్నట్లు ఎస్‌ఈ శ్రీధర్ తెలిపారు.

ఆల్మట్టికి 52,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

ఆల్మట్టి ప్రాజెక్టుకు 52,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 60వేల క్యూసెక్కుల నీటిని దిగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టుకు విడుదల చేస్తున్నారు. ఆల్మట్టి పూర్తి స్థాయి నీటి నిల్వ 129.72 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 97.00 టీఎంసీల నీరు నిల్వ ఉంది. నారాయణపూర్ ప్రాజెక్టుకు 70వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండగా.. 20 క్రస్టు గేట్లను ఎత్తి జూరాలకు ప్రాజెక్టుకు 65,955 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పూర్తి స్థాయి నీటి మట్టం 37.64 టీఎంసీలు కాగా.. ప్రస్తుతం 33.313 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

10 గేట్ల ద్వారా నీటి విడుదల

రాజోళి: సుంకేసుల డ్యాంకు ఎగువ నుంచి 46వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రాగా.. 10 గేట్లను తెరిచి 43,450 క్యూసెక్కులు దిగువకు, కేసీ కెనాల్‌కు 1,540 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు జేఈ మహేంద్ర పేర్కొన్నారు.

శ్రీశైలంకు కొనసాగుతున్న ప్రవాహం

దోమలపెంట: జూరాల ఆనకట్ట స్పిల్‌వే ద్వారా 31,464 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి చేస్తూ 31,806, సుంకేసుల నుంచి 39,105 మొత్తం కలిపి 1,02,375 క్యూసెక్కుల నీటి ప్రవాహం శ్రీశైలం వస్తుంది. శ్రీశైలం భూగర్భ కేంద్రంలో విద్యుదుత్పత్తి చేస్తూ 35,315 క్యూసెక్కులు, ఏపీ జెన్కో పరిధిలోని కుడిగట్టు కేంద్రంలో ఉత్పత్తి చేస్తూ 32,236 మొత్తం 67,551 క్యూసెక్కుల నీటిని దిగువన సాగర్‌కు విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో 883.4 అడుగుల వద్ద 206.97 టీఎంసీల నీటి నిల్వ ఉంది. ఇరవై నాలుగు గంటల వ్యవధిలో పోతిరెడ్డిపాడు ద్వారా 20 వేల క్యూసెక్కులు, హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ లిఫ్ట్ ద్వారా 1,013 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భూగర్భ కేంద్రంలో 17.585 మిలియన్ యూనిట్లు, కుడిగట్టు కేంద్రంలో 17.287 మి.యూనిట్లు విద్యుదుత్పత్తి చేశారు. స్థానికంగా 27.40 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

అమ్మో.. భారీ కొండచిలువ


పట్టుకున్న కొండచిలువ అటవీ ప్రాంతంలో వదులుతున్న అధికారులు

కొత్తకోట: పెబ్బేరు మండలం చెలిమిల్ల గ్రామంలోని ఓ ఇంటి ఆవరణలో భారీ కొండచిలువ ప్రత్యక్షమైంది. వివరాల్లోకి వెళితే.. ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన చెన్నకేశవ తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా ఓ భారీ కొండచిలువ అతడి పక్కకు చేరింది. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున కుక్కల అరుపులకు చెన్నకేశవ నిద్ర లేచి చూడగా తన పక్కనే కొండచిలువ కనిపించడంతో కంగుతిన్నాడు. వెంటనే గ్రామస్తులను పిలవడంతో వారి అరుపులకు కొండచిలువ ఇంటి మెట్ల కింద ఓ మూలకు చేరింది. గ్రామస్తులు వనపర్తికి చెందిన స్నేక్ క్యాచర్ కృష్ణసాగర్‌కు సమాచారం అందించారు. కృష్ణసాగర్‌తో పాటు ఫారెస్ట్ సెక్షన్ అధికారి విజయ్ గ్రామానికి చేరుకొని కొండచిలువను పట్టుకున్నారు. కొండ చిలువ సుమారు 26 కేజీల బరువు, 5 మీటర్ల పొడవు ఉన్నట్లు అధికారులు తెలిపారు. అనంతరం కొండచిలువలను సమీప అటవీ ప్రాంతంలో వదిలేసినట్లు ఫారెస్ట్ సెక్షన్ అధికారి విజయ్ పేర్కొన్నారు.

మాజీ సీఎం అచ్యుతానందన్ సేవలు చిరస్మరణీయం


మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

వనపర్తి రూరల్: కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ స్ఫూర్తి నేటి యువతరానికి మార్క్సిస్టు పార్టీకి శిరోధార్యమని, ఆయన పోరాటాలు చిరస్మరణీయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. సోమవారం జిల్లాకేంద్రంలోని దాచలక్ష్మయ్య పంక్షన్‌హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బాల్‌రెడ్డి అధ్యక్షతన 3వ రోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణా తరగతులకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ వీఎస్ అచ్యుతానందన్ సోమవారం తిరువనంతపురం ఆస్పత్రిలో మృతి చెందగా.. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి సంతాపం తెలిపారు. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా పెట్టుబడిదారీ సమాజం ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదన్నారు. ప్రధాని నరేంద్రమోడీ అమెరికాకు జూనియర్ భాగస్వామి కావడానికి తయారయ్యారని ఇది మనదేశ సార్వభౌమాధికారానికి ముప్పు తెస్తుందని విమర్శించారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా ఉద్యమించాలన్నారు. జిల్లా కార్యదర్శి ఆంజనేయులు మాట్లాడుతూ.. జిల్లాల్లో వచ్చేమూడేళ్లలో జరగాల్సిన రాజకీయ కర్తవ్యాలను ప్రణాళికను పార్టీ ప్రజాసంఘాల విస్తరణకు కావాల్సిన కర్తవ్యాలను వివరించారు. కార్యక్రమంలో నాయకులు జబ్బారు, రాజు, గోపి, లక్ష్మీ, ఆంజనేయులు, ఆర్‌ఎస్ రమేశ్, పరమేశ్వరాచారి, కుర్మయ్య తదితరులు పాల్గొన్నారు.

నాలుగు ఇళ్లలో చోరీకి యత్నం

తాళం వేసిన ఇళ్లే టార్గెట్


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్

గద్వాల క్రైం: గుర్తు తెలియని దుండగులు తాళం వేసిన ఇళ్లల్లో చోరీకి ప్రయత్నిస్తుండగా కాలనీ వాసులు కేకలు వేయడంతో తప్పించుకున్న ఘటన సోమవారం పట్టణంలో జరిగింది. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. గద్వాల పట్టణంలోని వేణుకాలనీలో నివాసం ఉంటున్న సాయిప్రకాష్ (ఎంపీడీఓ), బుగ్గారెడ్డి, అశోక్‌కుమార్ (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), సందీప్ ఇళ్లకు తాళాలు వేసి బంధువుల ఇళ్లకు వెళ్లారు. ఈ క్రమంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు ఒకేసారి వారి ఇళ్లల్లో చోరీకి యత్నించారు. ఈ క్రమంలో అశోక్‌కుమార్ ఇంట్లో బెడ్రూం తలుపులు ధ్వంసం చేస్తున్న క్రమంలో ఇంటి పక్కన నివాసముంటున్న మహేష్ కేకలు వేయడంతో దొంగలు పరారయ్యారు. కాలనీ వాసులు పట్టుకునేందుకు ప్రయత్నించినా పరారైనట్లు పేర్కొన్నారు. అనంతరం కాలనీవాసులు పట్టణ పోలీసులకు సమాచారం అందించారు. పట్టణ ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. నాలుగు ఇళ్లలో ఎలాంటి నగదు, ఆభరణాలు అపహరణకు గురికానట్లు పేర్కొన్నారు. సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా నిందితులను గుర్తించేందుకు విచారణ చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

రూ.లక్ష నగదు

తాళం వేసిన ఇంట్లో రూ.లక్ష నగదు అపహరించిన ఘటన సోమవారం పట్టణంలో చోటు చేసుకుంది. గద్వాల పట్టణంలోని బీరోలు చౌరస్తా సమీపంలో నివాసముంటున్న ఎండీ ఖలీల్ ఆదివారం ఉదయం అనంతపురం గ్రామంలోని బంధువుల ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా తాళం ధ్వంసం చేసి ఉండటాన్ని గమనించి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలోని రూ.లక్ష నగదు అపహరించినట్లు గుర్తించాడు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

పట్టపగలే ఆలయంలో..

మరికల్: మండల కేంద్రంలో పట్టపగలే సరస్వతీదేవి ఆలయంలో చోరీ జరిగింది. సోమవారం పూజారులు వెంకటేశ్వర్లశర్మ, శివప్రసాద్ పూజలు ముగించుకొని ఆలయానికి తాళం వేసి వెళ్లారు. మధ్యాహ్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఆలయంలోకి ప్రవేశించి హుండీ తాళం పగులకొట్టి నగదును ఎత్తుకెళ్లాడు. అదే విధంగా వెండి ఆభరణాలు ఉన్న బీరువా తాళం పగులకొట్టినా ఆభరణాలు చోరీ కాకపోవడంతో ఆలయ కమిటీ సభ్యులు ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పేర్కొన్నారు.

సజ్జ పంట సాగు లాభదాయకం



పాడి-పంట
జిల్లా వ్యవసాయాధికారి, సక్రియానాయక్

అలంపూర్: రైతులు ఏక పంట సాగు చేస్తూ తరుచూ నష్టాలు చవిచూస్తున్నారు. అలా కాకుండా చిరుధాన్యాల పంటలపై దృష్టిసారిస్తే నష్టాల బారి నుంచి బయటపడొచ్చని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సక్రియానాయక్ రైతులకు సూచించారు. అందులోనూ సజ్జ పంట సాగు లాభదాయకమని తెలిపారు. ఎర్ర నేలల్లో సజ్జ పంట సాగు చేస్తే అధిక దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతో కొంత విస్తీర్ణంలో సాగు చేయాలని రైతులకు విజ్ఞప్తి చేశారు.

సజ్జ ప్రాముఖ్యత

సజ్జ పంటను వర్షాధార, ఉష్ణ మండల ప్రాంతాల్లోనూ, భూసారం, నీటి నిల్వ శక్తి తక్కువ ఉన్న భూములలోనూ సాగు చేసుకోవచ్చు. సజ్జ అత్యధిక పోషక విలువలు కలిగి ఉంటుంది. వీటి నుంచి తయారు చేసిన జావ, గంజి తాగడం ద్వారా రక్తహీనత నుంచి బయటపడడంతో పాటు కంటి చూపునకు మేలు చేస్తుంది. 100 గ్రాముల సజ్జ గింజల నుంచి 361 కిలోల కేలరీల శక్తి లభిస్తోంది.

సాగు ఇలా.. సజ్జ సాగుకు తేలిక నుంచి మధ్య రకం ఎర్రనేలలు, నీరు ఇంకే భూములు అనుకూలం. ముందుగా ఎకరాకు నాలుగు టన్నుల పశువుల ఎరువులను ఆఖరి దుక్కిలో వేసి బాగా కలియదున్నాలి. ఎకరాకు 1.6 కిలోల విత్తనం అవసరం. విత్తే ముందు 2 శాతం (20 గ్రా/లీటర్ నీటికి) ఉప్పు ద్రావణం ఉంచాలి. ఈ విధంగా చేయడం వలన ఎర్గాట్ అనే శిలీంధ్ర అవశేషాలను వేరు చేయగలం. ఆరిన విత్తనానికి కిలోకు 3 గ్రాముల థైరామ్ లేదా అప్రాన్ 35 ఎస్‌డీ లేదా కాప్లాన్ మందును కలిపి విత్తన శుద్ధి చేసుకోవాలి. సాళ్ల మధ్య 45 సెం.మీ, మొక్కల మధ్య 12 నుంచి 15 సెం.మీ దూరంలో గొర్రుతో విత్తుకోవాలి.

ఎరువుల వాడకం

వర్షాధారపు పంటకైతే 50 కేజీల యూరియా, 75 కేజీల సింగిల్ సూపర్ ఫాస్ఫేట్, 15 కేజీల మ్యూరేట్ ఆఫ్ పొటాష్ వేయాలి. మొత్తం యూరియాను రెండు భాగాలుగా చేసి విత్తేటప్పుడు సగభాగం, పైరు మోకాళ్ల ఎత్తులో ఉన్నప్పుడు మిగితా భాగం వేయాలి.

సస్యరక్షణ

వానాకాలంలో సజ్జ పంటను వెర్రి తేనెబంక తెగుళ్లు ఆశించే అవకాశం ఉంది. తేనె బంక తెగుళ్ల నివారణకు పూత దశలో మాంకోజెట్ 2.5 గ్రాముల లీటర్ నీటికి లేదా కార్బండిజమ్ ఒక గ్రాము లీటర్ నీటికి కలిపి వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేయాలి.

కోత.. కంకులలోని సజ్జల గింజ కింది భాగాన్ని గమనిస్తే చిన్న నల్లని చుక్క కనిపిస్తోంది. మొక్కలోని అధిక భాగం ఆకులు పసుపు వర్ణంలోకి మారి ఎండిపోయినట్లు కనిపిస్తాయి. ఈ దశలో పంటను కోయాలి. పిల్ల కంకుల కంటే ప్రధాన కాండపు కంకి మొదట కోతకు వస్తోంది.

అంతర్ కృషి .. పంట వేసిన మొదటి 30 రోజుల వరకు పొలంలో ఏ విధమైన కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. విత్తిన రెండు వారాల్లోపు ఒత్తు మొక్కలను తీసివేయాలి. 25 నుంచి 30 రోజుల సమయంలో గుంటక లేదా దంతితో అంతర్ కృషి చేయాలి.

మేలేన రకాలు ఇవి: అధిక దిగుబడి ఇచ్చే సూటి రకాలు ఈసీటీపీ 8203, ఈసీఎంవీ 231, రాజ్ 171.

హైబ్రిడ్ రకాలు: హెచ్‌హెచ్‌బీ 67, ఈసీ ఎంహెచ్ 356, ఆర్‌హెచ్‌బీ 121, జీహెచ్‌బీ 538, పీహెచ్‌బీ 3, ఏబీహెచ్ 1.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని గంగాపూర్ శివారులో 167 నంబర్ జాతీయ రహదారిపై సోమవారం రాత్రి 10గంటల ప్రాంతంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి(36) దుర్మరణం చెందిన ఘటన చోటుచేసుకున్నది. ఓ వ్యక్తి బైక్‌పై జడ్చర్ల వైపు వస్తుండగా.. గుర్తు తెలిన వాహనం ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు సీఐ కమలాకర్ తెలిపారు. మృతుడు మిడ్జిల్ మండలానికి చెందిన వ్యక్తిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

రేపు హుండీ లెక్కింపు


అలంపూర్ క్షేత్ర ఆలయ సముదాయం

అలంపూర్: అలంపూర్ క్షేత్రం జోగుళాంబ బాలబ్రహ్మేశ్వర స్వామి ఆలయాల హుండీ లెక్కింపు కార్యక్రమం ఈ నెల 23న నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ పురేందర్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వామి, అమ్మవారి ఆలయాల హుండీ లెక్కింపు ఉదయం 9 గంటలకు ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. లెక్కింపులో గ్రామ పెద్దలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.